క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండల కేంద్రంలోని పలు కాలనీలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలోని సింగరేణి కాలనీ, మైనార్టీ కాలనీలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత


మాట్లాడుతున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని చందుగూడ గ్రామంలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీటీమ్స్, గంజాయి నివారణపై అవగాహన, సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై ఆటపాటల ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. ఎస్సై గుంపుల విజయ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబర్చితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకాంత్, శిరీష, కావేరి, మనస్వి, కీర్తన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 20, 21, 22వ తేదీల్లో వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు రమేశ్, రయీస్ అహ్మద్, రాంచందర్, శివా జీ, కవిత, యేసుమణి పాల్గొన్నారు.

'సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి'


అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రాజేశ్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ రాజేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తుండటంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలన్నారు. జీవశాస్త్రంలో మంచి మార్కులు సాధించేందుకు ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించారు. హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు మల్లేశ్, వెంకటేశ్, వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


సీజ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదీ లేదని తహసీల్దార్ రామ్మోహన్ రావు, ఎస్సై చంద్రశేఖర్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని గోల్లగూడలో గల ఇసుక రీచ్‌లను మైనింగ్ ఏడీ గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని వాగుల నుంచి ఎవరైనా ఇసుకను తరలించినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అవసరం ఉన్న వారు ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలన్నారు. ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆర్ఐ ప్రేంకిరణ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు



రోడ్డు ఏర్పాటుకు సంబంధించిన వివరాల బోర్డు


పగుళ్లు తేలిన రంగాపూర్ రోడ్డు

- ఆరు నెలలకే పగుళ్లు తేలిన రోడ్డు
- అధికారులు, కాంట్రాక్టర్లు మిలాఖత్

బెజ్జూర్: ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తున్నప్పటికీ కిందిస్థాయి అధికారుల పనితీరుతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలోని మారుమూల బెజ్జూర్ మండలంలో గిరిజన గ్రామాల అభివృద్ధి దయనీయంగా మారింది. ప్రభుత్వాలు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల చేతివాటం కారణంగా ఆరు నెలలు తిరగకముందే పూర్తిగా రహదారులు పగుళ్లు తేలుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధ్వానంగా రోడ్లు..

బెజ్జూరు మండలం పాతరంగాపురం గ్రామంలో రూ.62 లక్షల ఐటీడీఏ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఐదు నెలల క్రితమే ఈ రోడ్డు ప్రారంభించారు. ప్రస్తుతం రోడ్డు పగుళ్లు తేలి అధ్వానంగా మారింది. కాసుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ అధికారులకు రోడ్డు నాణ్యతపై ఎందుకు లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆరు నెలలకే అరవై ముక్కలు..

నిర్మాణం చేపట్టిన తారు రోడ్డు 15 నుంచి 20 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండాలని ప్రభుత్వం కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా అందిస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు కలిపి నాణ్యత లోపంతో రహదారులు నిర్మించి జేబులు నింపుకోవడంతో రహదారులు ఎక్కడికక్కడ పగుళ్లు తేలుతున్నాయి.

వర్షాకాలంలో బీటీ నిర్మాణం..

కాంట్రాక్టర్ వర్షాకాలంలో పనులు చేపట్టి నాణ్యత లేని మొరం వేయడం, వర్షం కురుస్తున్న సమయంలోనే బీటీ నిర్మాణం చేపట్టడంతో పగుళ్లు తేలినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బీటిరోడ్డు పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ బద్రోద్దీన్‌ను వివరణ కోరగా పగుళ్లు తేలిన రోడ్లకు మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు.

కళాశాలలో ఘనంగా వీడ్కోలు



కెరమెరి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో కెరమెరి కళాశాల ప్రిన్సిపాల్ అస్మత్ అలీ, అధ్యాపకులు నవీన్ రెడ్డి, శ్రీహరి, స్వామి, కుత్‌బోద్దిన్, బైరాగి, రాము, సునీల్, సరళ తదితరులు ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ 1లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు డి.అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి నిర్వహణకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. అనుమతి లేకుండా తరగతుల నిర్వహణతో విద్యార్థులు భవిష్యత్తులో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈవిషయంపై మండల విద్యాధికారి జయరాజ్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఇ.సాయినాథ్ ఉన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ఖాయం

పెంచికల్‌పేట్: రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం ఖాయమని పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల తాలుకా ఇన్‌చార్జి కొయ్యల ఎమ్మాజీ అన్నారు. మండలంలోని కొత్తగూడ గ్రామంలో పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు మధుకర్, శ్రీనివాస్, కాంతారావు, గోపాల్, మహేశ్ పాల్గొన్నారు.

బెజ్జూర్: మండలంలోని ఊట్ సారంగపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఎమ్మాజీ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో ప్రశ్నించే గొంతుకలకు శాసన మండలికి పంపించాలన్నారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రాచారి, వాసివుల్లా ఖాన్, సిడం సంతోష్, దిగంబర్, బాలకృష్ణ దిలీప్, మోహన్, తిరపతి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.


బెజ్జూర్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచారం

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సుల్కరి ఉమామహేశ్, దుర్గం విజయ్‌ల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్లతో మాట్లాడారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు గొర్ల అశోక్, బోర్ల వెంకటేశ్, కొండయ్య, మౌల్కార్ దేవాజీ, జుమ్మి ప్రదీప్, తరుణ్, శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళాశాలలో చట్టాలపై అవగాహన

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం షీటీం, భరోసా ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. బాల, బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంలో ఉన్న శిక్షల గురించి, బాల్య వివాహాల నిరోధక చట్టంపై ఎస్సైలు శిరీష, తిరుమల అవగాహన కల్పించారు. అత్యాచార బాధితులు భరోసా సెంటర్‌ను ఎలా సంప్రదించాలో వివరించారు. మహిళలు ఎవరైనా హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు గురైతే వెంటనే షీటీంలను సంప్రదించాలని ఎస్సై వెంకటేశ్వర్ అన్నారు. సోషల్‌మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైతే 100కు డయల్ చేయాలని, భరోసా నంబర్ 8712670561, షీటీం 8712670564, చైల్డ్ హెల్ప్ లైన్ 1093, సైబర్ క్రైం 1930 నంబర్‌లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అస్మత్‌అలీ, అధ్యాపకులు ఉన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సైలు

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా పని చేసి బదిలీపై శ్రీరాంపూర్ ఏరియాకు వెళ్తున్న జీఎం శ్రీనివాస్‌ను మంగళవారం టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో జీఎంను ఏరియా టీబీజీకేఎస్ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా జీఎంగా శ్రీనివాస్ అతి తక్కువ కాలమే పని చేసినప్పటికీ ఉద్యోగులు, అధికారుల మనుసును గెలుచుకున్నారన్నారు. సెంట్రల్ కమిటీ వైస్‌ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి వెంకటేశ్, సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, ఫిట్ కార్యదర్శి వెంకటేశ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆధ్వర్యంలో..

శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బదిలీపై వెళ్తున్న జీఎం శ్రీనివాస్‌ను మంగళవారం ఏరియా అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులు జీఎం సన్మానించి వీడ్కోలు పలికారు. ఏరియాకు జీఎం శ్రీనివాస్ చేసిన సేవలను కొనియాడారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఏరియా ఇంజనీరు రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యువతకు స్ఫూర్తి ప్రదాత శివాజీ

- ఆరె కులస్తుల ఆరాధ్య యోధుడు
- జిల్లాలో వందల శివాజీ విగ్రహాలు
- నేడు శివాజీ మహారాజ్ జయంతి

కౌటాల: మరాఠా సామ్రాజ్యయోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా జిల్లాలోని అభిమానులు, ఆరాధికులు వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పల్లెల నుంచి పట్టణాల వరకు ఏటా ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా జిల్లాలోని గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. నేడు శివాజీ జయంతి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శివాజీ మహరాజ్ అణగారిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటు పడ్డారని శివాజీని ఆరాధించే వారు చెబుతున్నారు. శివాజీకి మహిళల పట్ల అపారమైన గౌరవమని, ఇతర రాజ్యాలపై దండెత్తినప్పుడు స్త్రీలపై ఎలాంటి దాడులకు అనుమతించే వారు కాదని, వారిని తన ఆడబిడ్డలలాగే చూసుకునేవారని ఇలాంటి స్ఫూర్తి కోసమే గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరె కులస్తులు పేర్కొంటున్నారు. జిల్లాలో సుమారు లక్షకు పైగా శివాజీ మహరాజ్‌ను ఆరాధించే ఆరె కులస్తులున్నారు. వీరు ఆయా గ్రామాల్లో వందకు పైగా శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో యువత శివాజీ సైన్యం పేరిట కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. చందాలు వేసుకొని గ్రామాల్లో విగ్రహాలను, కమిటీ హాల్‌లను నిర్మించుకుంటున్నారు. జిల్లాకు సమీపంలోని మహారాష్ట్రలో శివాజీ మహరాజ్‌ను దైవసమానంగా భావిస్తారు. జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్, బెజ్జూర్, వాంకిడి మండలాలు సరిహద్దులో ఉండడంతో ఆయా మండలాల్లో మహారాష్ట్ర ప్రభావం పడుతోంది.

వేడుకలకు సిద్ధం..

బుధవారం శివాజీ మహరాజ్ 395వ జయంతికి జిల్లాలోని గ్రామాలు సిద్ధమవుతున్నాయి. శివాజీ మహరాజ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో, శివాజీ విగ్రహాల వద్ద తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా శివాజీ జయంతిని ఆరె కులస్తులతో పాటు ఆయన అభిమానులు పండుగలా జరుపుకుంటున్నారు. జయంతి సందర్భంగా గ్రామాల్లో భాజాభజంత్రీలతో ఊరేగింపులు నిర్వహించి శివాజీ విగ్రహాల వద్ద మహిళలు, అభిమానులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో జెండా ఎగురవేస్తుంటారు. అనంతరం అన్నదానాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. జయంతి పురస్కరించుకుని కాగజ్‌నగర్ హిందూ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని శివాజీ చౌక్(లారీ చౌరస్తాలో) అట్టహాసంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. శివాజీ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆరె కులస్తులు కోరుతున్నారు.


తాటిపల్లి గ్రామంలో శివాజీ విగ్రహం

సెలవు ప్రకటించాలని వినతులు

చింతలమానెపల్లి: శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19న సెలవు ప్రకటించాలని మండల ఆరెకుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రాలు అందజేశారు. బాబాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడారు. ఆరెకుల సంక్షేమ సంఘం నాయకులు ఉమామహేశ్, ఎల్ములె మహేశ్, సాత్పుతె తుకారాం, తిరుపతి, జాబరి భాస్కర్, దంద్రె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నాం..



ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత చరిత్ర యువతకు ఎంతో స్ఫూర్తి. గ్రామాల్లో శివాజీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నాం. ఏటా జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాం. ఆరె కులస్తులు, అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించాలి.

– ఎల్ములే దత్తు, మరాఠా సంఘం జిల్లా నాయకుడు

సెలవు ప్రకటించాలి



శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు శివాజీని గొప్పగా ఆరాధిస్తాం. అవిభాజ్య భారతదేశాన్ని శివాజీ పరిపాలించారు.

– బోయర్ రాధేశ్యాం, ఆరె సంఘం నాయకుడు

మానవత్వం చాటుకున్న పోలీసులు


మద్యం తాగిన వ్యక్తిని నీడకు తీసుకొస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్: మిట్ట మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి తీవ్రమైన ఎండలో నడిరోడ్డుపై పడిపోయిన ఒక వ్యక్తిని ఎస్సై ప్రశాంత్ గమనించి కానిస్టేబుల్ ప్రేమ్, సందీ ప్, మహేందర్‌ల సహాయంతో నీడలో కూర్చోబెట్టి డీహైడ్రేషన్‌కు గురికాకుండా మంచి నీరు తాగించి మానవత్వం చాటుకున్నారు. ఎండలో జాగ్రత్తలు తీసుకోవాలని, రానున్న రోజుల్లో చలివేంద్రం ఏర్పాటు చేస్తామని ఈసందర్భంగా ఎస్సై తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

- వారం రోజుల్లో మూడు చోరీలు
- తాజాగా వైన్స్‌లో చోరీ

నార్నూర్: దొంగలు ప్రజలను హడలెత్తిస్తున్నారు. వరుస చోరీలతో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. నార్నూర్ మండల కేంద్రంలో వారం వ్యవధిలోనే ప్రధాన మార్కెట్ ప్రాంతంలో మూడు దొంగతనాలు జరిగాయి. ఇప్పటికే ప్రముఖ వ్యాపారి జ్ఞానోబా పుస్కర్ కుటుంబ సమేతంగా వారం రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లగా తాళం పగలగొట్టి రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మరువకముందే ఈనెల 16న ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సిమెంట్ వర్క్ చేస్తున్న కూలీలు రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో వారికి సంబంధించిన మూడు సెల్ ఫోన్లు, రూ.5వేల నగదు దొంగిలించారు. ఈనెల 18న సోమవారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో మండల కేంద్రంలోని శ్రీనివాస వైన్స్ షట్టర్ తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వైన్స్ దుకాణం నుంచి రూ.97,000 నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తుండడంతో ఊళ్లకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. దొంగలు సీసీ ఫుటేజీలో రికార్డు అవుతున్నప్పటికీ ముఖానికి పూర్తిగా మాస్కులు ధరించి ఉండటంతో గుర్తుపట్టలేని పరిస్థితి ఉంది. ఈ మూడు దొంగతనాల్లో కేవలం ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు సీసీఫుటేజీల ద్వారా తెలుస్తోంది.

ఎస్సై పోస్ట్ ఖాళీ..

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఏడాది నుంచి ఎస్సై పోస్ట్ ఖాళీగా ఉంది. వరుస దొంగతనాలు జరుగుతున్నా కనీసం పెట్రోలింగ్ నిర్వహించలేని పరిస్థితిలో పోలీస్ శాఖ ఉంది. ఇప్పటికైనా పోలీస్‌శాఖ స్పందించి రెగ్యులర్ ఎస్సైని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.


దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ రహీంపాషా, సిబ్బంది

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మెలుకువలు తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ప్రతిభ ఆధారంగా రాణించే కోర్సుల గురించి వివరించారు. హెచ్ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు బడేసాహెబ్, గంగాభవాని, లక్ష్మీ, భారతి, భాగ్యశ్రీ, ఆత్మారాం, అస్తాబ్ అహ్మద్, ధన్‌రాజ్, సాధియ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహం

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామంలో మంగళవారం సీసీరోడ్డు పనులను బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ ప్రారంభించారు. గత కొన్ని రోజుల నుంచి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్డు నిర్మాణంతో సమస్య తీరుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎంపీ కోటా కింద రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కోవ విజయ్